## క్లుప్తంగా

### గర్భిణులకు వైద్య పరీక్షలు నేడు

వరికుంటపాడు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మండలంలోని గర్భిణులకు ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ యోజన పథకం ద్వారా వైద్యపరీక్షలు నిర్వహిస్తామని మండల వైద్యాధికారి కరిష్మా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్య, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు వారి పరిధిలోని గర్భిణులకు సమాచారం అందించి వైద్యపరీక్షలకు తీసుకురావాలన్నారు.

### తూర్పు రొంపిదొడ్లలో 'ఫ్యామిలీ డాక్టర్'



వైద్య పరీక్షలు చేస్తున్న ఆయేషా

వరికుంటపాడు : మండలంలోని తూర్పు రొంపిదొడ్ల గ్రామంలో మండల వైద్యాధికారి ఆయేషా 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 47 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మంచు కురవడం, చలిగాలులు వీస్తున్నందున దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.

### త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



వావిలేరులో ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

చేజర్ల : త్రైత సిద్ధాంత భగవద్గీతపై మండలంలోని వావిలేరు, దొరువుపాడు, పాడేరు, వావిలేరుకండ్రిక, పాడేరు గ్రామాల్లో సోమవారం ప్రచారం చేశారు. ప్రతిఒక్కరూ యోగ మార్గంలో ప్రయాణించాలని, ఆలయాల్లో దీపాలు వెలిగించాలని కోరారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు డి.పెంచలనరసయ్య, ఎం.కొండయ్య, ఈ.పద్మమ్మ, పి.కిశోర్, మాళవిక, టి.భాగ్యమ్మ, పి.జాహ్నవి, శేషాద్రి, పెంచలస్వామి పాల్గొన్నారు.

### అన్నదానం



వింజమూరు (ఉదయగిరి) : వింజమూరు మండల కేంద్రంలోని వేదగాయత్రీదేవి అయ్యప్పస్వామి దేవస్థానంలో అయ్యప్ప భక్తుల ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం సోమవారం జరిగింది. పట్టణంలోని అయ్యప్ప భక్తులతో పాటు గ్రామ ప్రజలు, విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

### మత్స్యకార ఉపకులాల వర్గీకరణ చేపట్టాలి

కావలి : రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మత్స్యకార ఉపకులాల వర్గీకరణ చేపట్టాలని మత్స్యకార నేత ప్రళయకావేరి వేణుగోపాల్ సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న మత్స్యకారుల్లో 14 ఉపకులాలు ఉన్నాయన్నారు. వర్గీకరణ జరగని కారణంగా కేవలం రెండు ఉపకులాలు మాత్రమే రాజకీయ ఫలాలు అందుకుంటున్నాయని వివరించారు. మిగిలిన 12 ఉపకులాలు రాజకీయంగా ఎటువంటి ఎదుగుదలకు నోచుకోవడం లేదని తెలిపారు. ప్రభుత్వ పథకాలు, రాజ్యాంగం కల్పించిన హక్కులు మత్స్యకారులకు సమానంగా అందేలా వర్గీకరణ చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే ఆ దిశగా చర్యలు చేపట్టి ఉపకులాల వర్గీకరణకు కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

### దాతల సాయం స్ఫూర్తిదాయకం

కావలి : పట్టణంలోని తుఫాన్ నగర్‌లో సంయుక్త సేవాసంస్థ సంరక్షణలో ఉన్న చిన్నారులకు ప్రతినెలా పలువురు దాతలు నిత్యావసర వస్తువులు అందిస్తూ సాయం చేయడం స్ఫూర్తిదాయకమని కావలి రెడ్‌క్రాస్ కార్యవర్గ సభ్యుడు గంధం ప్రసన్నాంజనేయులు అన్నారు. సంస్థ సంరక్షణలో ఉన్న చిన్నారులకు అవసరమైన నిత్యావసర వస్తువులను దాతలు రాజేంద్రప్రసాద్, రాధా, సతీష్, ఉషారాణి, ఆనందకుమార్, మాధవీలత, పద్మజ, పార్థసారథిరాజు, ఉషారాణి, జాహ్నవి, శ్రీధర్, ఝాన్సీ, నితన్‌కుమార్, నిఖిల సోమవారం అందజేశారు. చిన్నారులకు నిత్యావసర వస్తువులతో పాటు భవిష్యత్ అవసరాల కోసం పోస్టాఫీసులో నగదు కూడా జమచేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల కూత.. వినిపించదా?

నిత్యం ప్రయాణికుల రద్దీతో పాటు భారీగా ఆదాయాన్ని సమకూర్చే కావలి రైల్వేస్టేషన్‌లో ప్రమాదకర సమస్యలు తిష్ట వేసి ఉన్నాయి. ప్రజలను అవస్థల పాలు చేస్తూ.. పలు సందర్భాల్లో వారి ప్రాణాలను సైతం హరిస్తున్నాయి. దీనిపై దృష్టి సారించాల్సిన రైల్వే అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

- ప్రమాదాల పాలు చేస్తున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి
- నిర్లక్ష్యంగా రైల్వే అధికారుల తీరు
- ప్రయాణికులకు తప్పని కష్టాలు



ప్రమాదకరంగా రైలు పట్టాలు దాడుతున్న ప్రజలు

కావలి : జిల్లాలో నెల్లూరు తరువాత పెద్ద నగరంగా ఉన్న కావలిలో రైలు ప్రయాణాలు సాగించే ప్రజలు కూడా అధికంగా ఉన్నారు. ఇక్కడి రైల్వేస్టేషన్‌లో రోజుకు సుమారు 50కి పైగా రైళ్లకు స్టాపింగ్ ఉంది. నెలలో సుమారు లక్ష మందికి పైగా ప్రయాణాలు సాగిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యమున్న కావలి రైల్వేస్టేషన్‌పై అధికారులు చిన్నచూపు చూస్తున్నారు. ప్రయాణికుల భద్రతను గాలికి వదిలేసి ఇది మా బాధ్యత కాదు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.

**అంతా తికమక**

గతంలో కావలి రైల్వేస్టేషన్‌లో నాలుగు ప్లాట్‌ఫాంలు మాత్రమే ఉండేవి. అయితే కొత్తగా మరో ప్లాట్‌ఫాంను నిర్మించి దానికి ఒకటో నంబర్ కేటాయించారు. అయితే అనౌన్స్‌మెంట్‌లో ప్లాట్‌ఫాం నంబర్‌ను ఒకటి వదిలేసి, రెండో నంబర్ ప్లాట్‌ఫాంను ఒకటిగా, మూడును రెండుగా, నాలుగును మూడుగా అనౌన్స్ చేస్తుంటారు. కొన్నిసార్లు అసలు అనౌన్స్‌మెంట్ కూడా చేయరు. దీంతో ప్రయాణికులు గందరగోళంగా ఉంటూ అటూ ఇటూ పరుగులు తీస్తుంటారు. పైగా ప్లాట్‌ఫాంపై ఫుట్ ఓవర్ బ్రిడ్జి ప్రయాణికులకు దూరంగా ఉంటుంది. దీంతో రైలు పట్టాలపై దిగి దాటుతుంటారు. చివరికి ప్లాట్‌ఫాంపై కోచ్ పొజిషన్ కూడా డిస్‌ప్లే కూడా సక్రమంగా ఉండడం లేదు. దీంతో రైలు ఆగిన తరువాత ప్రయాణికులు తికమక పడుతుంటారు. భారీ లగేజీలతో పరుగులు తీస్తుంటారు. ఇదంతా రైల్వే స్టేషన్‌లో ఉండే అధికారులు చూస్తూనే ఉన్నప్పటికీ, ప్రయాణికుల గోడును పట్టించుకోరు. దీనిపై ఎవరైనా అధికారులకు చెబుతామని వెళ్తే మాకు సంబంధం లేదు.. ఇక్కడి నుంచి వెళ్లండి.. అంటూ ఛీత్కరించుకుంటుంటారు. ఏడాదికి రూ.15 కోట్ల రాబడిని ప్రయాణికుల ద్వారా ఆర్జిస్తున్న రైల్వే శాఖ వారికి సరైన వసతుల కల్పనలో ఎలాంటి చిత్తశుద్ధి చూపడం లేదు.

**అవస్థలకు గురి చేస్తున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి**

కావలి రైల్వేస్టేషన్‌లో నూతనంగా నిర్మించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి ప్రయాణికులను అవస్థల పాలు చేస్తోంది. కొత్తగా నిర్మించినప్పటికీ ప్రయాణికుల సౌలభ్యం, సౌకర్యం వంటి అంశాలను అధికారులు పట్టించుకోలేదు. ఎక్కడైనా ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ప్లాట్‌ఫాం మధ్యలో ఉంటుంది. అయితే కావలిలో ప్లాట్‌ఫాం చివర నిర్మించారు.

**సౌకర్యాలు మెరుగుపడాలి**

కావలి రైల్వేస్టేషన్‌లో ఎంత మంది ప్రయాణికుల ప్రాణాలు పోతున్నాయో తెలిసి కూడా అధికారులు మౌనంగా ఉంటున్నారు. దీనిపై జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యతను విస్మరించడం బాధాకరం. రైల్వే అధికారుల్లో మార్పు రావాలి. ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగు పడాలి.

– కూనం తాతిరెడ్డి, అధ్యక్షుడు, రైల్ అండ్ రోడ్ ప్యాసింజర్స్ అసోసియేషన్, కావలి

**చివరి నిమిషంలో పరుగులు**

కావలి రైల్వేస్టేషన్‌లో 2, 3, 4 నంబర్ల ప్లాట్‌ఫాంలపైనే రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే చివరి వరకు రైలు ఎక్కడ ఆగేది తెలియకుండా ఉంటుంది. కాగా కావలిలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ప్లాట్‌ఫాం చివర్లో నిర్మించడం వల్ల అంత దూరం పరుగులు తీయలేక పట్టాల మీదుగానే ప్రయాణికులు దాటుతున్నారు. ఇలా కొన్ని సందర్భాల్లో పట్టాల మీదనే ప్రజలు పడిపోవడం, అదే సమయంలో రైలు రావడంతో ప్రమాదాలు జరిగిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇదంతా రైల్వే అధికారుల ముందే జరుగుతున్నా.. వారిలో ఎలాంటి చలనం ఉండడం లేదు.




కనుచూపుమేర కనిపించని ఫుట్ ఓవర్ బ్రిడ్జి



ప్లాట్‌ఫాం చివర్లో నిర్మించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి

### మధ్యాహ్న భోజనం తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ చలపతి

ఆత్మకూరురూరల్ : మండలంలోని మహిమలూరు ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓ–2 చలపతి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేసి నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

### సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ వేణుగోపాల్

ఆత్మకూరు : ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు డీఎస్పీ కె.వేణుగోపాల్ అన్నారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌ను ఆయన సోమవారం సాయంత్రం తనిఖీ చేశారు. ఇటీవలి కాలంలో నమోదైన కేసులపై ఆరాతీశారు. పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫోన్ల ద్వారా జరిగే సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అదే క్రమంలో ఆత్మకూరు పట్టణంలో ఈవ్‌టీజింగ్ లాంటి వాటికి పాల్పడకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట ఎస్సైలు షేక్ జిలానీ, సాయిప్రసాద్ తదితరులు ఉన్నారు.

## నీటి సంఘం జాబితాల్లో తప్పులను సవరించాలి



కావలి ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వీరరఘు, రైతులు

బిట్రగుంట : బోగోలు చెరువు నీటి సంఘం ఓటరు జాబితాలో తప్పులను సవరించి అర్హులైన రైతులకు ఓటు హక్కు కల్పించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు కావలిలో ఆర్డీఓ వంశీకృష్ణకు సోమవారం వినతిపత్రం అందజేశారు. తప్పుల తడకగా ఉన్న ఓటరు జాబితాపై పూర్తి ఆధారాలతో గత నెల 13వ తేదీన బోగోలు తహసీల్దార్‌కు, తరువాత ప్రజా సమస్యల పరిష్కార వేదిక సందర్భంగా కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇచ్చినట్లు వివరించారు. కలెక్టర్ ఆదేశాలతో విచారణ చేపట్టిన అధికారులు కొంత మేర మాత్రమే తప్పులు సరి దిద్దారని, ఇంకా చాలా వరకూ తప్పులు ఉన్నాయని వివరించారు. సర్వే నంబరు 95–3లో పర్వతాల ప్రమీలమ్మ అనే మహిళ తన పొలాన్ని ఇతరులకు రిజిస్ట్రేషన్ ద్వారా విక్రయించినా ఇంకా ప్రమీలమ్మ పేరుపైనే ఓటు హక్కు ఉందన్నారు. అదే విధంగా సర్వే నంబర్ 107–3, 108కు సంబంధించి వీరాల శ్రీనివాసులు, వీరాల సావిత్రమ్మలు తమ భూమిని చౌకిచెర్ల సుదీర్‌బాబుకు రిజిస్ట్రేషన్ ద్వారా విక్రయించగా ఓటరు జాబితాలో మాత్రం విక్రయించిన వారి పేర్లు మాత్రమే ఉన్నాయన్నారు. సర్వే నంబరు 156–1–1లో, సర్వే నంబరు 100–1లో మరణించిన వారి పేర్లే ఇంకా జాబితాలో ఉన్నాయన్నారు. ఇలా ఓటరు జాబితా తప్పుల తడకగా ఉన్నాయని వివరించారు. అధికారులు స్పందించి ఓటరు జాబితాలు సరిచేయాలని కోరారు. ఆయన వెంట ఆయకట్టు రైతులు, తదితరులు ఉన్నారు.

## 700 ఎకరాల్లో శనగ పంటకు నష్టం



విరువూరులో మినుము పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

వరికుంటపాడు : ఫెంగల్ తుఫాన్ కారణంగా మండలంలో వరి, శనగ పంటలు దెబ్బతిన్నాయని, విరువూరులో 700 ఎకరాల్లో శనగ పంట దెబ్బతిన్నట్లు మండల వ్యవసాయాధికారి వి.రవికుమార్ తెలిపారు. మండలంలోని విరువూరు గ్రామంలో సాగులో ఉన్న మినుము పంటను మండల ఏఓ తన సిబ్బందితో సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కొండ్రాజుపల్లి, జి.కొండారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో వరి పంట 70 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు గుర్తించామన్నారు. పంట నష్టం నివేదికలను తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తున్నామన్నారు. మరోసారి వర్షం కురిస్తే మినుము పంట కూడా దెబ్బతినే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వీఏఏ శారద, సిబ్బంది పాల్గొన్నారు.

## మామిడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి

కావలి : నియోజకవర్గంలోని 3,500 ఎకరాల్లో మామిడి సాగు చేస్తున్న రైతులు బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కావలి ఉద్యానశాఖ అధికారిణి ఎం.సుధామయి చెప్పారు. ఈ మేరకు ఆమె రూరల్ మండలంలో మామిడి తోటలను సోమవారం పరిశీలించి, మాట్లాడారు. ఎకరానికి రైతు రూ.2,250 ప్రీమియం చెల్లించాలని, ఏదైనా నష్టం జరిగితే ఎకరాకు రూ.45 వేలు నష్టపరిహారంగా అందుతుందన్నారు. 15లోగా నమోదు చేసుకోవాలన్నారు.

## సమస్యలపై వినతుల స్వీకరణ



ఉదయగిరి : అర్జీదారుని సమస్యలు వింటున్న తహసీల్దార్ సుభద్ర

ఉదయగిరి : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మండలంలోని పలువురు అర్జీదారులు తమ సమస్యలపై తహసీల్దార్ సుభద్రకు వినతిపత్రాలు సమర్పించారు. భూ పట్టాల కోసం, అడంగల్‌లో మార్పులు, పట్టాదారు పాసు పుస్తకాలు, 1–బీ, అడంగల్‌లో పేర్ల మార్పులు తదితర అంశాలకు సంబంధించి అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**మూడు అర్జీల స్వీకరణ**

చేజర్ల : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మూడు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ మురళి సోమవారం తెలిపారు. వావిలేరుకు చెందిన ఒకరు తమ పొలాన్ని అడంగళ్‌లో ఎక్కించాలని, చేజర్లకు చెందిన ఒకరు డేటాఫ్ బర్త్‌లో కరెక్షన్ చేయాలని, కోటితీర్థానికి చెందిన వ్యక్తి పొలానికి పాస్ ఇవ్వాలని కోరినట్లు తెలియజేశారు.

# అమాత్యా.. పరిష్కరించరూ..

- వేధిస్తున్న రెవెన్యూ సమస్యలు
- నేడు పొంగూరులో సదస్సు

మర్రిపాడు : ఆత్మకూరు నియోజకవర్గంలో పెద్ద మెట్ట ప్రాంతమైన మర్రిపాడు మండలంలో రెవెన్యూ సమస్యలు వేధిస్తున్నాయి. అందులోనూ అత్యధికంగా భూ ఆక్రమణలే ఉన్న నేపథ్యంలో మంగళవారం పొంగూరు గ్రామంలో జరిగే రెవెన్యూ సదస్సుకు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి హాజరు కానుండడంతో ప్రజలు అమాత్యా మా ప్రాంతంలో రెవెన్యూ సమస్యలు పరిష్కరించరూ.. అంటూ కోరుతున్నారు.

**ఇదిగో సమస్యలు**

మండలంలోని 21 రెవెన్యూ గ్రామాల్లో అధిక ప్రభుత్వ భూములు ఆక్రమణల్లో ఉన్నాయి. అందులోనూ రెవెన్యూ సదస్సు నిర్వహించనున్న పొంగూరులోనే ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలంటూ గ్రామస్తులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చిన ఘటనలు ఉన్నాయి. అదే విధంగా కేతిగుండ, పల్లిపాడులో సైతం భూ వివాదాలు ఉన్నాయి. అంతేకాకుండా పలు రెవెన్యూ గ్రామాల్లో అసలైన భూమి కంటే రెండు రెట్లు భూమి అధికంగా రికార్డుల్లో నమోదై ఉన్నాయి. దీంతో అసలు భూమిపై ఏ సర్వే నంబర్‌లో ఏ లబ్ధిదారుడు ఉన్నాడో కూడా స్పష్టమైన అవగాహన ఉండడం లేదు. దీనికి తోడు ఇటీవల మండలంలోని పలు గ్రామాల్లో భూ ఆక్రమణలు జరిగి అధికారుల దృష్టికి వెళ్లడంతో వారు హెచ్చరిక బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. సొంత భూమిపై తమ పేరుపై నమోదు చేసుకునేందుకు రోజుల తరబడి రైతులు తిరిగిన సందర్భాలు ఉన్నాయి. ఇలా రెవెన్యూ సమస్యలు రోజురోజుకు పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హాజరు కావడంపై ప్రజలు కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు.

### రేపటి నుంచి ఎస్‌ఏ టర్మ్–1 పరీక్షలు

ఉదయగిరి : మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 1 నుంచి 10 తరగతుల విద్యార్థులకు బుధవారం నుంచి ఈనెల 19వ తేదీ వరకు సెల్ఫ్ అసిస్మెంట్(ఎస్‌ఏ) టర్మ్–1 పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ మస్తాన్‌వలీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ప్రశ్నపత్రాలు ప్రభుత్వ పాఠశాలలకు చేరాయన్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల్లో నగదు చెల్లించిన వారికి కూడా సరఫరా చేశారన్నారు.

- వరికుంటపాడు : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఒకటి నుంచి పది తరగతులు చదివే విద్యార్థులకు బుధవారం నుంచి 19వ తేదీ వరకు సెల్ఫ్ అసిస్మెంట్ టర్మ్–1 పరీక్షలు జరుగుతాయని ఇన్‌చార్జి ఎంఈఓ–1 మస్తాన్‌వలీ సోమవారం తెలిపారు.

### మృతులకు కన్నీటి నివాళి



కావలి : పల్నాడు జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో కావలి రూరల్ మండలం సిరిపురం గ్రామానికి చెందిన సురేష్, వసంత దంపతులు, ఏబులు మృతిచెందగా, వారి మృతదేహాలు సోమవారం గ్రామానికి చేరుకుంది. ఈ క్రమంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డితో పాటు గ్రామస్తులు మృతదేహాలకు కన్నీటి నివాళులర్పించారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు. అలాగే సురేష్, వసంత దంపతుల ఇద్దరు పిల్లలను ఆయన ఓదార్చారు. అనంతరం పట్టణంలోని వైకుంఠపురంలో తాతా తిరుపతి మృతదేహానికి ఎమ్మెల్యే నివాళులర్పించారు.

### పాఠశాలకు విజ్ఞాన పుస్తకాలు



ఆత్మకూరు : పట్టణంలోని వెస్ట్ ప్రాథమిక పాఠశాలకు పులిమి వైదేహి అనే దాత రూ.2 వేలు విలువ చేసే విజ్ఞానదాయక పుస్తకాలను సోమవారం అందించారు. వీటిని ఆమె హెచ్‌ఎం వై.సీతాదేవికి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగాధర్, మంజులవాణి, ధనమ్మ పాల్గొన్నారు.

## కేజ్ వీల్స్‌తో తిరగడం నేరం

- ఎంవీఐ రాములు



ట్రాక్టర్ డ్రైవర్‌ను హెచ్చరిస్తున్న ఎంవీఐ రాములు

ఆత్మకూరు : రైతులు తమ వ్యవసాయ పనుల కోసం బురదలో దుక్కి చేసేందుకు ట్రాక్టర్లకు ఇనుప చక్రాలు (కేజ్‌వీల్స్) ఏర్పాటు చేస్తుంటారని, అయితే అదే ఇనుప చక్రాలతో ఇతర పొలాలకు వెళ్లేందుకు తారురోడ్లపై ప్రయాణించడం నేరమని ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాములు అన్నారు. మున్సిపల్ పరిధిలోని యడవల్లి–నాగులపాడు రహదారిలో ఆయన సోమవారం వాహన తనిఖీలు చేశారు. ఇనుప చక్రాలతో తిరిగే ట్రాక్టర్ల యజమానులకు అవగాహన కల్పించేందుకు, అతిక్రమిస్తే కేసులు నమోదు చేసేందుకు వాహన తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. ఇనుప చక్రాలతో సిమెంటు, తారురోడ్లపై తిరిగితే రోడ్లు ధ్వంసమవుతున్నాయని, దీనిపై అవగాహన పెంచుకుని నిబంధనలు అతిక్రమించరాదన్నారు. తొలిసారి పరిశీలనలో ఎదురైనా వాహనదారులను హెచ్చరించి వదిలేశానని, ఇకపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## కార్మికుల సమస్యల పరిష్కారానికి వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ఆత్మకూరు : మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల జీతాలను వెంటనే చెల్లించాలని, ఇంజినీరింగ్ విభాగ కార్మికులకు వేతనాల పెంపుపై గతంలో జరిగిన ఒప్పందాన్ని అమలు చేయాలని కోరుతూ ఆత్మకూరు మున్సిపల్ కార్మికులు సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ సి.గంగాప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో కార్మికుల ఈపీఎఫ్, సాధారణ సౌకర్యాలైన యూనిఫాం, పాదరక్షలు, సోపు, చమురు తదితర వాటిని ఎప్పటికప్పుడు అందించాలని వారు తమ డిమాండ్‌లో పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జె.నాగరాజు, పట్టణ కార్యదర్శి బి.హజరత్తయ్య, అధ్యక్షుడు షేక్.మునీర్‌బాషా, పి.కృష్ణయ్య, కె.నాగేంద్ర, డి.వాసు, జానీ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి ఆనం

ఆత్మకూరు : నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో గృహ వినియోగదారులతో పాటు వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా కృషి చేయాలని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలకు సంబంధించి పరిష్కరించాల్సిన అంశాలపై సోమవారం నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు డివిజన్, జిల్లా విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో మూడు మండలాల మీదుగా నూతన రైల్వేలైన్ నిర్మాణం, జాతీయ రహదారి నిర్మాణం లాంటి పనులు జరుగనున్న దృష్ట్యా విద్యుత్‌శాఖ పరంగా చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. పలు గ్రామాల్లో ఐదు నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా విద్యుత్‌శాఖ ఎస్‌ఈ విజయన్, ఆత్మకూరు విద్యుత్‌శాఖ డీఈ శ్రీనివాసరావు, పలువురు ఏఈలు పాల్గొన్నారు.